మార్చి 1, 2 తేదీల్లో కవ్వాల్ బర్డ్ ఫెస్టివల్

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 26 : మంచిర్యాల అటవీ శాఖ, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా సంయుక్తంగా మార్చి 1, 2 తేదీల్లో కవ్వాల్ బర్డ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ అశీష్ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్, గోదావరి పరీవాహక ప్రాంత పక్షి వైవిధ్యం సంరక్షణ గురించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు పక్షి ప్రేమికులు, పరిశోధకులు, స్థానిక సమాజాన్ని ఒక చోట చేర్చుతూ కవ్వాల్ పక్షి మహోత్సవ కార్యక్రమాన్ని మంచిర్యాల కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నిపుణుల మార్గదర్శకత్వంలో పక్షుల వీక్షణ (జన్నారం కవ్వాల్, చెన్నూర్ గొల్లవాగు ప్రాజెక్ట్ ఏరియాలో) కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని పక్షులను గుర్తించి, వాటి ప్రత్యేకతలను తెలుసుకునే అవకాశం ఉంటుందని వెల్లడించారు. ప్రముఖ పక్షి శాస్త్రవేత్తలు, నిపుణుల ఆధ్వర్యంలో ఉపాన్యాసాలు, పాఠశాల, కళాశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, అటవీ శాఖ సిబ్బందికి ఇయర్లీ బర్డ్, బర్డ్ కౌన్ట్ ఇండియా, ఐఐఎస్ఈఆర్ తిరుపతి, రౌండ్ గ్లాస్ సస్టేన్, హైదరాబాద్ బర్డింగ్ పాల్స్, మంచిర్యాల అటవీ విభాగం నిపుణుల ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పక్షి సంరక్షణపై అవగాహన పెంచే కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎఫ్ఓ సూచించారు.

భూ ఘర్షణలో గోడ కూలి ఒకరి మృతి

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రాజశేఖర్

మందమర్రి రూరల్, ఫిబ్రవరి 26 : భూ ఘర్షణలో ఒకరు మృతిచెందిన ఘటన మందమర్రి మండల పరిధిలోని చిర్రకుంట గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకున్నది. అందుకు సంబంధించిన వివరాలను బుధవారం మందమర్రి సర్కిల్ కార్యాలయంలో సీఐ శశిధర్ రెడ్డి వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చిర్రకుంటకు చెందిన సండ్ర రవి(48), సండ్ర ఎల్లయ్య(45) మధ్య కొద్ది రోజులుగా ఇంటి వద్ద భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో సండ్ర ఎల్లయ్య.. పాత విషయాలను మనసులో పెట్టుకొని తిట్టాడు. దీంతో సండ్ర రవి, అతడి అన్న కొడుకు కార్తీక్ ఎందుకు తిడుతున్నావని ప్రశ్నించారు. సండ్ర రవి భూమిలో ఉన్న వేపచెట్టు వల్ల తన బాత్రూం గోడ పగిలిపోతున్నదని గోడను తన్నాడు. ఆ సమయంలో పక్కనే ఉన్న రవిపై పడింది. స్థానికులు వెంటనే బయటకు తీసి, అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా, పరిస్థితి విషమించడంతో బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య సండ్ర సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఎల్లయ్యను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

పెట్రోల్‌లో నీళ్లు..!

పెట్రోల్‌లో నీళ్లు వచ్చాయని చూపుతున్న బాధితుడు

కౌటాల, ఫిబ్రవరి 26 : మండలంలోని ముత్తంపేటలో ఓ పెట్రోల్ బంక్‌లో బుధవారం పెట్రోల్‌లో నీళ్లు వచ్చాయని వినియోగదారులు ఆందోళన చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..దహెగాం మండలం బిబ్రా గ్రామానికి చెందిన దుర్గం వసంత్ పెట్రోల్ పోయించుకొని కొద్ది దూరం వెళ్లగానే బైక్ ఆగిపోయిందని తెలిపాడు. అనుమానం వచ్చి మోటర్ సైకిల్‌లోని పెట్రోల్‌ను బాటిల్‌లో నింపి చూడగా అందులో 25 శాతం నీళ్లు వచ్చాయని, వెంటనే పెట్రోల్ బంక్‌కు వచ్చి సిబ్బందిని అడిగాడు. సిబ్బంది దురుసుగా ప్రవర్తించడంతో వసంత్‌తో పాటు అక్కడికి వచ్చిన ఇతర వాహనదారులు కూడా ఆందోళన చేశారు. ఈ విషయంపై తహసీల్దార్‌కు తెలియజేయడంతో వెంటనే సిబ్బందిని పంపి పెట్రోల్‌ను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

కాసిపేట : కాసిపేట పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ ప్రవీణ్ కుమార్

కాసిపేట, ఫిబ్రవరి 26 : కాసిపేట మండలంలో గురువారం నిర్వహించే పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాసిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పట్టభద్రుల ఎన్నికలకు 48 నంబర్ పోలింగ్ స్టేషన్‌లో 461 పురుషులు, 301 మహిళా పట్టభద్రులు మొత్తం 762 మంది ఉన్నారు. ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి 27 నంబర్ పోలింగ్ స్టేషన్‌లో పురుషులు 10, మహిళలు ఆరుగురు ఉన్నారు. ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తాండూర్, ఫిబ్రవరి 26 : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో నియమావళి నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని తాండూర్ ఎస్ఐ డీ కిరణ్‌కుమార్ హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉంటున్న నేపథ్యంలో 200 మీటర్ల పరిధిలో ఆంక్షలుంటాయని తెలిపారు.

హాజీపూర్, ఫిబ్రవరి 26 : హాజీపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో 1,352 మంది పట్టభద్రులు, 20 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. బుధవారం సాయంత్రం పోలింగ్ సామగ్రితో పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. హాజీపూర్ తహశీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండే పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ ఎన్నికల బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.

రెబ్బెన, ఫిబ్రవరి 26 : రెబ్బెన మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ రామ్మోహన్‌రావు తెలిపారు. 1-మైక్రో అబ్జర్వర్, 1-ప్రిసైడింగ్ అధికారి, 5-పోలింగ్ క్లర్క్‌లు ఉంటారని పేర్కొన్నారు. ఓటర్లు ఎన్నికల సంఘం ద్వారా గుర్తించబడిన గుర్తింపు కార్డులు ఏదైనా తీసుకొని రావాలని సూచించారు.

జేసీబీ, రెండు ట్రాక్టర్లు సీజ్

భీమారం, ఫిబ్రవరి 26 : భీమారం మండలం దాంపూర్ అటవీ ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం రాత్రి పట్టుకున్నట్లు మంచిర్యాల రేంజర్ రత్నాకర్‌రావు తెలిపారు. కాగా, బీట్ అధికారి బానేశ్‌పై సంబంధిత యాజమాని దాడి చేశాడని పేర్కొన్నారు. విధులకు అటంకం కలిగించడంతో పాటు, బైక్‌పై ఇసుక డంప్ చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే భీమారం అటవీ ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న జేసీబీతో పాటు, ట్రాక్టర్‌ను అటవీ అధికారులు సీజ్ చేశారు. బూర్గుపల్లి ట్రాక్టర్ యాజమానిపై ఫిర్యాదు చేసినట్లు ఎఫ్ఆర్వో రత్నాకర్‌రావు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

చెన్నూర్ టౌన్, ఫిబ్రవరి 26 : చెన్నూర్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ లక్ష్మీ రవళి (ఎండీ) సుమారు 100 మందికి పరీక్షలు చేశారు. వృత్తి రీత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నప్పటికీ, స్వగ్రామం చెన్నూర్‌లోని ప్రజలకు వైద్య సేవలందించాలనే ఉద్దేశంతోనే శిబిరం ఏర్పాటు చేశానని వైద్యురాలు తెలిపారు. పూర్ణ చందర్ గౌడ్, పబ్బ భాస్కర్, ఎల్లాగౌడ్, రెబ్బెన నగేశ్, కొమ్మెర సాకేత్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మొరం మట్టి దందా

అభివృద్ధి పేరిట విచ్చలవిడిగా రవాణా

• ప్రభుత్వ ఆదాయానికి కుచ్చుటోపు • కన్నెత్తి చూడని అధికారులు

నెన్నెల, ఫిబ్రవరి 26 : ఇసుక, మొరం, మట్టి కావాలా..? ఇక్కడి నుంచి తీసుకుపోవచ్చు.. మీకు ఎంత కావాలన్నా ఎవరి అనుమతులూ అవసరం లేదు. అభివృద్ధి పేరు చెప్పండి.. అంతే. ఇక మీ ఇష్టం. కానీ, షరతులు వర్తిస్తాయి. నెన్నెల మండలంలో విచ్చలవిడిగా దందాలు సాగుతున్నాయి. ఎక్కడ నిర్మాణం జరిగినా ఫలాన వ్యక్తులు మట్టి ఇసుక, మొరం అందజేస్తారు. ఇతరులు సరఫరా చేస్తే ఆ నిర్మాణాలు నిలిచిపోవాల్సిందే. నెన్నెల సమీప బొప్పారంలో గల ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా ఏకంగా సుమారు 45 రోజుల పాటు, మొరం తవ్వకాలు చేపట్టారు. దీంతో ప్రభుత్వానికి సుమారుగా రూ.25లక్షల మేర ఆదాయం రాకుండాపోయింది. అనుమతులు తీసుకుంటే ప్రభుత్వానికి క్యూబిక్‌మీటర్ లెక్కన రాయల్టి చెల్లించాల్సి ఉంటుంది. సదురు కాంట్రాక్టర్ మాత్రం అనుమతులు లేకుండా, నాయకులు ఉంటే చాలని చెప్పుకొని బెల్లంపల్లి, మంద మర్రి, నెన్నెల రోడ్లకు వందల కొద్ది మొరం, మట్టి ట్రిప్పులను తరలించారు. ఒక్క రోజు కూడా మైనింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు అటు పక్కా వెళ్లి చూసిన పాపాన పోలేదు. అభివృద్ధికే కదా అన్నమాట చెప్పుకుంటూ దాట వేశారు. రోడ్లతో పాటు, ఇండ్ల నిర్మాణాలు, ప్రైవేటుగా ప్లాట్లలో పోసి అమ్ముకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొరం తవ్వుతున్న ప్రాంతానికి బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ రమేశ్ వెళ్లి, పంటల సాగు నమోదు చేశారే తప్పా మొరం తవ్వుతున్న వారిని ప్రశ్నించలేక పోయారు. ఇక ఇసుక మాత్రం రోజురోజుకు వేల క్యూబిక్‌మీటర్లు తరలిపోతున్నది. మండలంలోని ఖర్జీ ఇసుక రిచ్ ఉన్నా అక్కడి నుంచి కాకుండా నెన్నెల సమీపంలోని వాగు నుంచి

బొప్పారం వద్ద ప్రభుత్వ భూమిలో మొరం తీసుకుపోతున్న లారీలు

నెన్నెలలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

దర్జాగా తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. పదుల కొద్ది ట్రాక్టర్లు రాత్రి, పగలు తేడా లేకుండా నడుస్తున్నా ఏ ఒక్క అధికారీ పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్ల నిర్మాణానికి సైతం ఇసుక అనుమతులు లేవు. ఉన్నా కలెక్టర్ ఆదేశాల మేరకు రిచ్ నుంచి టోకెన్ తీసుకొని పోవాలి కానీ, ఇక్కడ ఒక్క ట్రాక్టర్‌కూ టోకెన్ లేదు. ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణలకు సైతం ఇష్టారీతిన ఇసుక తరలిస్తున్నారు. ఒక్క ట్రాక్టర్ ఇసుకకు ప్రభుత్వానికి రూ.300తో పాటు కిలోమీటర్‌కు రూ.85 లెక్కన ట్రాక్టర్‌కు చెల్లించాలి. కానీ ఒక్కడ ప్రభుత్వానికి వచ్చే రూ.300 మాత్రం రావడంలేదు. ఇదిలా ఉండగా, అధికారులకు ఎవరైనా ఫిర్యాదు చేస్తే కనీసం అటువైపు కన్నెత్తి చూడడంలేదన్న ఆరోపణలూ ఉన్నాయి. జిల్లా మైనింగ్ కార్యాలయం నుంచి నిత్యం నలుగురు ఎస్ఆర్‌లు ఇసుక అక్రమ రవాణా కాకుడా చూడాల్సి ఉంటుంది. నెన్నెలలో జరుగుతున్న ఇసుక తతంగంపై వార కన్నెత్తి కూడా చూడడంలేదని ఇక్కడి వారు అంటున్నారు. దీంతో పాటు కొన్ని ట్రాక్టర్లే ఇసుక సరఫరా చేయాలన్న నిబంధనను విధించారని పలువురు పేర్కొంటున్నారు. వారు మాత్రమే ఇసుక తరలించాలని, ఇతరుల ట్రాక్టర్లు తరలిస్తే కేసుల పాలు కావడం నిజమని అంటున్నారు. గొల్లపల్లిలో రెండు ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక తరలిస్తున్నాయని ఫిర్యాదు చేస్తే, రెవెన్యూ అధికారులు ఒక ట్రాక్టర్‌ను పట్టుకొని మరో ట్రాక్టర్‌ను విడిచిపెట్టారన్న ఆరోపిస్తున్నారు. ఇసుక, మట్టి, మొరం ఏదైనా సరే ఇక్కడి నుంచి ఎక్కడికైనా తరలించి అమ్ముతాం అన్న ఒక బోర్డు పెట్టడమే ఇక్కడ మిగిలిందని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఈ విషయంపై జిల్లా మైనింగ్ అధికారిని ఫోన్ ద్వారా పలుమార్లు సంప్రదించగా స్పందించలేదు.

నీసీసీ నస్పూర్ : నస్పూర్ శివాలయంలో పూజలు చేస్తున్న డైరెక్టర్ దంపతులు, శ్రీరాంపూర్ జీఎం

జైపూర్ : వేలాల గట్టుమల్లన్నను దర్శించుకున్న రామగుండం సీపీ శ్రీనివాస్

బెల్లంపల్లి : కన్నాల బుగ్గ రాజరాజేశ్వర స్వామి జాతరకు వెళ్లే దారిలో భారీగా ట్రాఫిక్ జామ్

శైవక్షేత్రాల్లో 'మహా' సందడి

నమస్తే నెట్‌వర్క్, ఫిబ్రవరి 26 : మహా శివరాత్రి సందర్భంగా మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మంచిర్యాల జిల్లా కేంద్రలోని పుష్కరఘాట్ గోదావరి తీరం జనసంద్రమైంది. భక్తులు పుణ్యస్నానాలు చేసి, సైకత లింగాలను పూచించారు. నది ఒడ్డున ఉన్న గౌతమేశ్వర, మార్కెట్ ఏరియాలోని శ్రీ విశ్వనాథ ఆలయం, గౌతమినగర్ కోదండ రామాలయం, హైటెక్ సిటీ హరిహర క్షేత్రాలయం పాత మంచిర్యాల రామాలయం శివాలయంలో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం, అర్చనలు చేశారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, రాజకుమారి దంపతులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌కుమార్ పుణ్యస్నానాలు పాల్గొన్నారు. అలాగే లక్షెట్టిపేట పుష్కరఘాట్‌లో పుణ్యస్నానాలు చేశారు. విశ్వనాథ స్వామి ఆలయంలోని శివాలయంలోని శివలింగాన్ని దర్శించుకున్నారు. కాలేజ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన మహా ప్రస్థానంలో ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు, సతీమణి, జిల్లా అధ్యక్షురాలు సురేఖతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌లో గల శివాలయంలో శివ పార్వతుల కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి దంపతులు హాజరై, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. పెద్దవాగు ఒడ్డున గల శ్రీ బాలేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడింది. చిర్రకుంటలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్ పాల్గొన్నారు. ఆసిఫాబాద్ డిపో ఆర్టీసీ ఆధ్వర్యంలో ఆయామండలాల్లో జరిగే జాతరలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. జైపూర్ మండలం వేలాల గట్టు మల్లన్న గుట్ట భక్తులతో కిటకిటలాడింది. సమీప గోదావరిలో పుణ్యస్నానాలు చేసి, కాలి నడకన గుట్టపైకి చేరుకున్నారు. బోనం వండి మొక్కులు చెల్లించుకున్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, సరోజ దంపతులు, అలాగే మంచిర్యాల డీసీపీ భాస్కర్, డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్‌తో కలిసి రామగుండం సీపీ శ్రీనివాస్ దర్శించుకున్నారు. అనంతరం డ్రోన్ ద్వారా జాతర రద్దీని పరిశీలించారు. ఇక్కడ రెండు రోజులు జాతర జరుగనుండగా, అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో రమేశ్ తెలిపారు. వేలాల గట్టు మల్లన్న, శ్రీరాంపూర్ కృష్ణాకాలనీలోని శివాలయంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. దండేపల్లి మండలం గూడెం, ద్వారక, గుడిరేవు, లక్ష్మీకాంతాపూర్ గోదావరి తీరాల్లో భక్తులు పుణ్యస్నానాలు చేశారు. ద్వారక తీరంలో మహిళలు బట్టలు మార్చుకునేందుకు సౌకర్యాలు కల్పించకపోవడంతో అసౌకర్యానికి గురయ్యారు. గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. చెన్నూర్ మండలం కత్తెరసాల మల్లికార్జున స్వామి ఆలయంలో మల్లికార్జున స్వామి బ్రహ్మరాంభిక కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి దంపతులు పూజలు నిర్వహించారు. కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం శివ మల్లన్న ఆలయంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు, మాజీ ఎమ్మెల్యే కోనప్ప, మాజీ జడ్పీ చైర్మన్ కృష్ణారావు.., అలాగే చింతలమానేపల్లి మండలం కర్జెల్లి ముసలమ్మ గుట్ట శివాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. నస్పూర్ నాగార్జునకాలనీలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి శివాలయంలో సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్‌వీ సూర్యనారాయణ దంపతులు, శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. బెల్లంపల్లి మండలం కన్నాల బుగ్గ రాజరాజేశ్వర స్వామి జాతరలో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కన్నాల గ్రామం నుంచి బుగ్గకు వెళ్లే దారిలో భారీగా ట్రాఫిక్ సమస్య తలెత్తింది. రోడ్డుపై ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి ట్రాఫిక్ క్లియర్ చేశారు. సమస్య తలెత్తే ప్రాంతాల్లో ముందస్తుగా పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచకపోవడంతోనే సమస్య తలెత్తిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లక్షెట్టిపేట : పుణ్యస్నానాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, విజిత్‌రావు

ఎమ్మెల్యే చెబితేనే కరెంట్ కట్ చేశాం

మాట్లాడుతున్న జీఎం దేవేందర్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 26 : బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి చెబితేనే మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సింగరేణి క్వార్టర్లకు విద్యుత్ కనెక్షన్లు కట్ చేశామని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ ప్రకటించడంపై పట్టణంలో చర్చనీయాంశమైంది. శాంతిఖని భూగర్భగని పర్యావరణ అనుమతుల కోసం వచ్చే నెల 6న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పాత జీఎం కార్యాలయ శాంతిఖని ఏజెంట్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విద్యుత్ కనెక్షన్ల తొలగించడంపై జీఎం ప్రకటనపై కార్మికులు, కార్మికేతరులు, వారి కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పాలన ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటికే పలు సార్లు సింగరేణి క్వార్టర్లలో కనెక్షన్లు తొలగించి, ట్రాన్స్‌ఫార్మర్లు విద్యుత్ కార్యాలయానికి తరలించారు. ఈ విషయంలో కన్నాలబస్తీ, టేకుల బస్తీకి చెందిన కుటుంబాలు రాస్తారోకో చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాలు కూడా సమర్పించారు. ఈ క్రమంలో తిరిగి ఎమ్మెల్యే హామీతో విద్యుత్‌ను పునరుద్ధరించినట్లు కిందిస్థాయి నాయకులు ప్రచారం చేసుకున్నారు. గత ఏడాదిగా ఇక్కడ ఇదే తంతు కొనసాగుతున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మళ్లీ ఎమ్మెల్యే ఆదేశిస్తే తిరిగి విద్యుత్ కనెక్షన్లు కట్ చేస్తామని కూడా ఇదే సమావేశంలో జీఎం ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. విద్యుత్ కనెక్షన్లు తొలగించమని తానే ఆదేశాలు జారీ చేయడం, తానే జీఎంతో మాట్లాడి సమస్యను పరిష్కరించానని ప్రచారం చేసుకోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల నిబంధనలకు పాతర

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 26 : కాగజ్‌నగర్ పట్టణంలో ఎన్నికల నిబంధనలకు పాత రేస్తూ విచ్చలవిడిగా మద్యం విక్రయాలు చేపడుతున్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాలకు సీల్ వేశారు. అయినా దుకాణాల వద్ద గోప్యంగా విక్రయాలు జరుపుతున్నారు. అయినా సంబంధిత ఎక్సైజ్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవల్సిన అధికారులు.. దుకాణాలకు సీల్ వేసి చేతులు దులుకున్నారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.

'ఆటో డ్రైవర్ల బతుకులు ఆగం జేసిన్రు'

బెల్లంపల్లి, ఫిబ్రవరి 26 : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్ల బతుకులు ఆగమయ్యాయని ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ ఆరోపించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా ఆటో డ్రైవర్ల బతుకులను మరింత దుర్భరంగా మార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు అంటేనే ఆటో డ్రైవర్లపై మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అర కొర సంపాదనతో కుటుంబాలను నెట్టుకువస్తుంటే ప్రభుత్వం ఉచిత బస్సులు తీసుకురావడంతో ఆటో డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారిందని విమర్శించారు. ఓ వైపు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు, మరో వైపు గిరాకీ లేక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణాలను 50 సంవత్సరాల నుంచి పైబడిన వారికి మాత్రమే వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఆటోడ్రైవర్లందరికీ న్యాయం జరిగే విధంగా చొరవ చూపాలని తెలిపారు. లేదంటే జిల్లాలోని ఆటో డ్రైవర్స్ అండ్ యూనియన్ నాయకులతో కలిసి తమ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేశ్, నాయకులు ఆరేపల్లి సతీశ్, తొగరి రాహుల్, రవి, శంకర్, తదితరులు పాల్గొన్నారు

ఓట్ల కోసం డబ్బు పంపిణీ

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 26 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం నస్పూర్‌లో అభ్యర్థుల తరపున డబ్బు పంపిణీ జోరుగా సాగింది. అభ్యర్థులు తమకు ఓటు వేస్తారనే నమ్మకం ఉన్న పట్టభద్రుల లిస్ట్ ప్రకారం ఒక్కొక్కరికీ రూ.వెయ్యి పంపిణీ చేశారు. లిటిల్ రోబో పాఠశాలలో బుధవారం రాత్రి కాంగ్రెస్ అభ్యర్థి తరపున కరస్పాండెంట్ ఊట్ల సత్యనారాయణ టీచర్లకు డబ్బు పంపిణీ చేశారు. సమాచారం అందుకున్న మీడియా అక్కడికి వెళ్లగా, టీచర్లంతా వెళ్లిపోయారు. పాఠశాలకు సెలవు ఉన్నప్పటికీ ఎందుకు వచ్చారని ప్రశ్నించగా, సమాధానం చెప్పకుండా జారుకున్నారు. అనంతరం పాఠశాలకు తాళం వేసి వెళ్లిపోయారు.

రాత్రి పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు, టీచర్లు

పుణ్యస్నానికి వెళ్లి.. గోదావరిలో ఒకరి గల్లంతు

కోటపల్లి, ఫిబ్రవరి 25 : శివరాత్రి సందర్భంగా గోదావరి నదిలో పుణ్యస్నానానికి వెళ్లి మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పారుపల్లికి చెందిన రాదండి రాజేశ్(50) గల్లంతయ్యాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..శివరాత్రి సందర్భంగా బుధవారం ఉదయం గ్రామంలోని లక్ష్మీదేవర అమ్మవార్ల విగ్రహాలను జలాభిషేకం కోసం గోదావరికి తీసుకెళ్తుండగా గ్రామస్తులతో పాటు రాజేశ్ వెళ్లాడు. ఎర్రాయిపేట సమీపంలో స్నానం చేసేందుకు గోదావరి నదిలో దిగి గల్లంతయ్యాడు. స్థానికులు గమనించి గాలించినా దొరకలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కోటపల్లి ఎస్ఐ రాజేందర్ ఘటనా స్థలానికి చేరుకొని స్థానిక మత్స్యకారులతో సాయంత్రం వరకు గాలించినా ఆచూకీ దొరకలేదు. ఘటనా స్థలంలో భార్య, పిల్లలు, బంధువులు రోదనలు గ్రామస్తులను కలిచివేశాయి. రాజేశ్‌కు భార్య రేవతి, కుమారుడు సంతోష్, కూతురు శివ నందిని ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాతరకు వెళ్లి వస్తుండగా.. ఆటోబోల్తా.. ఒకరి మృతి

వాంకిడి, ఫిబ్రవరి 26 : వాంకిడి మండలంలో ఆటో బోల్తా పడి గోయేగాం గ్రామానికి చెందిన షేక్ హకాణి (55) మృతి చెందగా మరో నాలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..బుధవారం వాంకిడిలోని శివాలయం వద్ద శివారాత్రి సందర్భంగా జరిగిన జాతరకు వెళ్లి వస్తుండగా గోయేగాం గ్రామ సమీపంలో ఆటో అదుపు తప్